సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



చిన వెంకన్న మా కులదైవం

ద్వారకాతిరుమల: చిన వెంకన్న తమ కులదైవమని సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. కుటుంబ సమేతంగా ఆయన స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు.



అమ్మవారి సన్నిధిలో..

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారిని బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

హరోంహర.. శంభో శంకర

భీమవరం (ప్రకాశం చౌక్): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా పంచారామక్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమా సోమేశ్వర జనార్దన స్వామి ఆలయంలో లక్షపత్రి పూజలు చేశారు. విశేష అలంకరణలో స్వామి వారు దర్శనమిచ్చారు.



న్యూస్‌రీల్

పేరుపాలెం బీచ్‌లో వైఎస్సార్ స్మృతి వనం



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: పేరుపాలెం బీచ్‌ను అంతర్జాతీయ వసతులతో అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టామని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బీచ్‌లో రూ.కోటి వ్యయంతో చేపట్టిన దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహం, స్మృతి వనం, పార్కు నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పర్యాటక పరంగా పేరుపాలెం బీచ్‌ను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతుందన్నారు. గతేడాది బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించామన్నారు. వచ్చేనెలలో మరోమారు బీచ్ ఫెస్టివల్‌ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పేరుపాలెం బీచ్ అభివృద్ధికి తొలిసారిగా బీజం వేసింది వైఎస్సార్ అన్నారు. ఆయన విడుదల చేసిన నిధులతో బీచ్ కనెక్టవిటీతో రోడ్ల నిర్మాణం చేశామన్నారు. ఏటా బీచ్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని, బ్లూఫాగ్ గుర్తింపునకు కూడా ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

శ్రీవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ హరినాథ్‌కు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.హరినాథ్ శనివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వక స్వాగతం పలికారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ ఏఈఓ పి.నటరాజారావు చిన వెంకన్న జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు.

మావుళ్లమ్మ సన్నిధిలో ఎన్నికల డిప్యూటీ సీఈఓ



ఆలయంలో ఆదూరి వెంకటేశ్వరరావు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల డిప్యూటీ సీఈఓ ఆదూరి వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ ఆయనకు అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

తుపానుపై అప్రమత్తం

- జిల్లాపై 'మిచాంగ్' ప్రభావం
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- 13 మంది జిల్లాస్థాయి అధికారుల నియామకం
- వరి కోతలు వాయిదా వేసుకోవాలని అధికారుల సూచన
- మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరిక



'వరి'వడిగా మాసూళ్లు.. పాలకోడేరు మండలం కొండేపూడిలో ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

భీమవరం(ప్రకాశం చౌక్): బంగాళాతంతో ఏర్పడిన వాయుగుండం తుపాను (మిచాంగ్)గా మారి దాని ప్రభావం జిల్లాపై ఉండటంతో సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. ఆదివారం నుంచి తుపాను ప్రభావంతో జిల్లాలో బలమైన గాలులు, వర్షాలు కురిసే అవకాశం ఉందనే హెచ్చరికల నేపథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు అధికారులను నియమించారు. కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి మండల, డివిజన్, జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశారు.

కంట్రోల్ రూమ్‌లు.. ప్రత్యేకాధికారులు

తుపాను నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించడానికి, ఆపదలో ఉంటే సహాయం కోసం జిల్లాలో అన్ని మండలాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు. భీమవరం కలెక్టరేట్‌లో కూడా కంట్రోలు రూమ్‌లు ఏర్పాటుచేశారు. జిల్లాస్థాయిలో 13 మందిని ప్రత్యేకాధికారులుగా నియమించి శాఖాపరమైన సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. మూడు రెవెన్యూ డివిజన్ల ఆర్డీఓలను ప్రత్యేక అధికారులుగా నియమించి వారి ద్వారా తహసీల్దార్లు, అక్కడి నుంచి గ్రామాల వారీగా సహాయక చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని 20 మండలాలకు 20 మంది ప్రత్యేక అధికారులతో పాటు కలెక్టరేట్‌లో ఆరుగురు సిబ్బందిని కంట్రోల్ రూమ్‌లో షిఫ్టుల ప్రకారం పనిచేసేలా ఏర్పాట్లు చేశారు.

విపత్తుల నివారణకు..

భారీ వర్షాలు కురిస్తే లోతట్టు, తీర ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులను బాధ్యతలు అప్పగిస్తున్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని జిల్లా అధికారులు సూచిస్తున్నారు. అలాగే ఇప్పటికే మాసూళ్లు చేసిన పంటను పక్కాగా భద్రపరుచుకోవాలని, పట్టుబడి చేసిన ధాన్యాన్ని మిల్లులకు వెంటనే పంపించాలని సూచిస్తున్నారు.

144 రైళ్ల రద్దు

ఏలూరు (టూటౌన్): తుపాను కారణంగా రైల్వే శాఖ ఈనెల 3 నుంచి 6 వరకూ కోస్తా ప్రాంతాల్లో తిరిగే దాదాపు 144 రైళ్లను రద్దు చేసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దయినట్టు ఏలూరు స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు. కాకినాడ పోర్టు–చెంగల్పట్టు, విశాఖ–కడప, విశాఖ–తిరుపతి, విశాఖ–చెన్నై సెంట్రల్, తిరుపతి–భువనేశ్వర్, నరసాపురం–కొట్టాయం, హౌరా– ఎస్ఎంవీ బెంగుళూరు, గౌహతి–ఎస్ఎంవీ బెంగుళూరు, నాగర్‌కోయిల్–షాలీమార్ (గురుదేవ్ ఎక్స్‌ప్రెస్), హాతియా–ఎస్ఎంవీ బెంగళూరు, హౌరా–చెన్నై (మెయిల్), షాలీమార్–చెన్నై సెంట్రల్ (కోరమాండల్), ఎస్ఎంవీ బెంగళూరు–భువనేశ్వర్, కాకినాడ టౌన్–ఎస్ఎంవీ బెంగళూరు, హౌరా–ఎస్ఎంవీ బెంగళూరు, ధర్మవరం–నరసాపురం, కాకినాడ టౌన్–తిరుపతి మధ్య నడిచే అప్ అండ్ డౌన్ రైళ్లు రద్దు చేశారని తెలిపారు.

విద్యుత్ కంట్రోల్ రూమ్‌లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట)/భీమవరం అర్బన్: తుపాను ప్రభావంతో విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు, వినియోగదారులకు సత్వర సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు ప్రకటనలో తెలిపారు. ఏలూరు విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో 9440902926, భీమవరం డివిజన్ కార్యాలయంలో 94906 10143 నంబర్లతో 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. 1912 టోల్‌ఫ్రీ నంబర్ కూడా అందుబాటులో ఉందన్నారు.

ప్రత్యేకాధికారుల నియామకం

అధికారి	సెల్ నంబర్
జాయింట్ కలెక్టర్	9888639678
జిల్లా ఎస్పీ	9493026234
ఇరిగేషన్ ఈఈ	9490151001
ఫైర్ ఆఫీసర్	9949991059
మెడికల్ అండ్ హెల్త్	9440018346
సివిల్ సప్లయీస్ మేనేజర్	8977017898
వ్యవసాయశాఖ అధికారి	8331056015
మత్స్యశాఖ అధికారి	9440814728
పశుసంవర్ధక శాఖ అధికారి	6281832610
విద్యుత్ శాఖ అధికారి	9440812707
ఆర్అండ్‌బీ అధికారి	9440818054
పంచాయతీ అధికారి	9392486583
ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి	9100121217
కలెక్టరేట్ కంట్రోల్ రూమ్	08816 299219

ధాన్యాన్ని సమీపంలోని రైసు మిల్లులకు తోలండి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైతులు తమ ధాన్యాన్ని దగ్గరలోని రైసు మిల్లులకు తరలించాలని డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తుపాను ప్రభావంతో ఆదివారం నుంచి 5వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సీఎం జగన్ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. రైతులు తమ ధాన్యాన్ని తమకు కేటాయించిన రైసుమిల్లులకు తోల్సాల్సి వచ్చేదని, అయితే ప్రభుత్వం నిబంధనను సడలించి రైతులు తమకు దగ్గరలో ఉన్న ఏ రైసు మిల్లుకైనా తోలుకొనే అవకాశం కల్పించిందన్నారు. ఇప్పటికే మెట్ట రైతులు మాసూళ్లు పూర్తి చేశారని, అక్కడక్కడా కొంత ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాల్సి ఉందన్నారు. డెల్టాలో ధాన్యాలను మిల్లులకు పంపే పనిలో ఉన్నారన్నారు. ఇలాంటి రైతుల కోసం ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చిందన్నారు. దీని కోసం రైతులు రైతు భరోసా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్వోను సంప్రదించాలన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మత్స్యకారులూ.. వేటకు వెళ్లొద్దు

తుపాను కారణంగా జిల్లాలోని తీర ప్రాంతాల నుంచి మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని, అలాగే గోదావరి, యనమదుర్రు డ్రెయిన్, ఇతర కాలువల్లోకి చేపల వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రూ.కోటి విడుదల

మిచాంగ్ తుపాను ప్రభావం పశ్చిమగోదావరి జిల్లాపై ఉండటంతో తుపానును సమర్థంగా ఎదుర్కొనేందుకు సహాయక చర్యల నిమిత్తం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.కోటి నిధులను విడుదల చేశారు.



పేరుపాలెంలో అలల ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

తీరంలో 'అల'జడి

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలంలోని సముద్ర తీర ప్రాంతాన్ని శనివారం రాత్రి కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి సందర్శించారు. సముద్రంలో అలల ఉధృతిని పరిశీలించారు. ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ కూడా రాత్రి నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని సముద్ర తీర ప్రాంతాలను సందర్శించారు.

8 వరకు బీచ్‌కు రావొద్దు : తుపాను నేపథ్యంలో ఆదివారం నుంచి ఈనెల 8వ తేదీ వరకూ పేరుపాలెం, కేపీపాలెం బీచ్‌లను మూసివేస్తున్నామని, ప్రజలు, పర్యాటకులు ఎవరూ రావొద్దని మొగల్తూరు తహసీల్దార్ అనితాకుమారి తెలిపారు.

చురుగ్గా ధాన్యం పట్టుబడులు

భీమవరం: తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా మాసూళ్లు చేసిన ధాన్యాన్ని పట్టుబడులు పట్టడం, మెరక ప్రాంతంలో రాశులు చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. జిల్లాలో 2.11 లక్షల ఎకరాల్లో సార్వా సాగు చేయగా ఇప్పటివరకు దాదాపు లక్ష ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. నాలుగైదు రోజులుగా మాసూళ్లు చేసిన రైతులు ధాన్యం ఎండబెట్టి రాశులు చేయగా వాటిని రక్షించే పనిలో ఉన్నారు. కొందరు రైతులు కళ్లాల్లోని ధాన్యాన్ని మెరక ప్రాంతాలకు చేరవేసి భద్రపర్చే పనిలో నిమగ్నమయ్యారు. ధాన్యం రాశుల అడుగుభాగాన గడ్డి, ఊక వంటివి వేసి దానిపై బరకాలు కప్పుతున్నారు. కోత యంత్రాలతో మాసూళ్లు చేస్తున్నా ధాన్యాన్ని నాలుగైదు రోజులు ఎండబెట్టాల్సి ఉండటంతో ప్రతికూల వాతావరణంలో ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చాలా ప్రాంతాల్లో మాసూళ్లను నిలిపివేస్తున్నారు.



పెనుమంట్ర మండలంలో రైతులకు సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్

జగనే ఎందుకు కావాలో..
ఇంటింటా చెప్పండి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు కావాలో ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలని వార్డు ఇన్‌చార్జులు, బీఎల్‌ఏలకు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దిశానిర్దేశం చేశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ వార్డు ఇన్‌చార్జులు, బీఎల్‌ఏలతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, ప్రజలు పొందిన లబ్ధి తదితర అంశాలపై ప్రతి ఇంటికి వెళ్లి చెప్పాలన్నారు. 2014–2019 టీడీపీ పాలనలో ప్రజలను చంద్రబాబు ఎలా వంచించాడో కూడా తెలియజేయాలన్నారు. 650 హామీలు ఇచ్చి చివరకు మేనిఫెస్టోను నెట్ నుంచి మాయం చేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీదని విమర్శించారు. సీఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన, ఇవ్వని సుమారు 100కు పైగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. జగనన్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి పేద కుటుంబానికీ లబ్ధి చేకూరిందన్నారు. అలాగే ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను బీఎల్‌ఏలు నిశితంగా పరిశీలించాలన్నారు. టీడీపీ నాయకులు అనుకూల ఓటర్లను చేర్చుకొని.. కాని వారి పేర్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ కుట్రలను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, గుండుబోగుల నాగు, కొలుకులూరి ధర్మరాజు, తెన్నేటి జగ్జీవన్, బోణం విజయనిర్మల, తాడిపర్తి రజిని, కర్నాటి కన్నయ్య, బోళెం రమణ, వెనాటి సత్తిబాబు, చిటికన ప్రసాద్, మిద్దే నారాయణ, షఫీ, కృష్ణ, వట్టి బుజ్జి, కోడే సత్యశ్రీనివాస్, అద్దాల నర్సింహరావు, అశోక్, యజ్జల రాంబాబు, పెనుగొండ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

యువ ఓటర్లపై
ప్రత్యేక దృష్టి

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెద్ద మొత్తంలో చేర్పులు, మార్పులు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, బీఎల్‌ఓలు రిజిస్టర్లు, క్లెయిములు, దరఖాస్తులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని ఆదేశించారు. డోర్ టు డోర్ సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎటువంటి తప్పులు లేకుండా కచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించాలని తెలిపారు.

తుపానుపై కలెక్టర్ సమీక్ష : జిల్లా ప్రజలు తుఫాన్ హెచ్చరికలను పాటిస్తూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి ఆమె సమీక్షించారు. సహాయక చర్యలు, పునరావాస శిబిరాలు తదితర అంశాలపై సూచనలిచ్చారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

మంత్రి కారుమూరి

ఇరగవరం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. రేలంగి గ్రామంలో శనివారం ప్రధాని ఉజ్వల యోజన పథకం ద్వారా మంజూరైన ఉచిత గ్యాస్ కనెక్షన్లను మంత్రి కారుమూరి లబ్ధిదారులకు అందజేశారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న మనసున్న వ్యక్తి సీఎం జగన్ అని కొనియాడారు. గ్యాస్ కనెక్షన్ లేని ఇల్లు ఉండరాదని ఉజ్వల పథకంలో ఉచిత కనెక్షన్లు ఇస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో ఇటువంటి పథకాలను ప్రవేశ పెట్టలేదని విమర్శించారు. వలంటీర్లు గడపగడపకూ వెళ్లి సంక్షేమ పథకాలను అందించడం తప్పా అని ప్రశ్నించారు. అటువంటి వలంటీర్ వ్యవస్థను ప్రతిపక్షం, పవన్ కళ్యాణ్ రద్దు చేయాలంటున్నారని మండిపడ్డారు. జెడ్పీటీసీ పంపన అంజిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, దినేష్ రెడ్డి, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్న మంత్రి కారుమూరి

కొత్త ప్రాంగణంలో కోర్టు సేవలు

భీమవరం: పట్టణంలోని మూడో అదనపు జిల్లా కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల ఆఫీసు కార్యకలాపాలను ఈనెల 4 నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద కొత్తగా ఏర్పాటుచేసిన కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్నామని మూడో అడిషనల్ జిల్లా జడ్జి జి.సత్యాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వాస్పత్రి దగ్గరలోని సివిల్ కోర్టు కాంప్లెక్స్‌లో ఉన్న కోర్టు సేవలను బీఎస్ఎన్ఎల్ కార్యాలయం మొదటి, రెండో అంతస్తులకు మార్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కొత్త భవనంలో సేవలను వినియోగించుకోవాలని సత్యాదేవి తెలిపారు.

పాలకొల్లులో 'మినీ ముంబై'

క్లుప్తంగా

'ఎస్ఆర్‌కేఆర్' విద్యార్థికి క్యాంపస్ కొలువు



విద్యార్థి చరణ్‌సాయిని అభినందిస్తున్న దృశ్యం

భీమవరం : భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఐటీ ఫైనల్ ఇయర్ విద్యార్థి శిరిగినీడి చరణ్‌సాయి రూ.18 లక్షల వార్షిక వేతనంతో డేటా ఇన్సైట్స్ సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. విద్యార్థి చరణ్‌సాయిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ అభినందించిన సందర్భంగా వివరాలను తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు అత్యధిక వేతనంతో క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు పొందుతున్నారన్నారు. కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డీన్ కేఆర్ సత్యనారాయణ, కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, బీహెచ్‌వీ రామకృష్ణంరాజు, వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

ఇరగవరం: బైక్‌పై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. కర్ణాటకకు చెందిన కరెడ్ల సతీష్ (25) రేలంగిలోని తన సోదరి ఇంటికి మూడు రోజుల క్రితం రైలులో వచ్చాడు. శనివారం బైక్‌పై నిడదవోలు బయలుదేరాడు. రేలంగి రైల్వే గేట్ సమీపంలో మలుపు వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రగాయాలైన అతనిని 108 వాహనంలోకి ఎక్కిస్తుండగా మృతి చెందాడు. ఎస్సై డి.ఆదినారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్రైడే డ్రెస్ మార్కెట్

- పాలకొల్లులో ప్రత్యేక దుస్తుల వారపు సంత
- శుక్రవారం ఒక్కరోజే నిర్వహణ, ఎన్నో ఏళ్ల చరిత్ర
- ఒకే హాల్లో 112 దుకాణాలు, రూ.కోటి టర్నోవర్
- దూర ప్రాంతాల నుంచి వస్తున్న వ్యాపారులు, కొనుగోలుదారులు
- అందుబాటులో అన్ని రకాల దుస్తులు

సండే స్పెషల్

సాధారణంగా సంత మార్కెట్ అంటే కూరగాయలు, నిత్యావసర సరుకులు, ఇతర అన్ని రకాల వస్తువులు దొరుకుతుంటాయి. ఎక్కడెక్కడి నుంచో వ్యాపారులు సరుకులు తెచ్చి విక్రయిస్తుంటారు. అయితే పాలకొల్లులో వినూత్నంగా కేవలం దుస్తులు మాత్రమే విక్రయించే సంత మార్కెట్ ఉంది. ప్రతి శుక్రవారం జరిగే ఈ సంత మార్కెట్‌లో రూ.కోటికి పైగా లావాదేవీలు జరుగుతుంటాయి. మినీ ముంబైగా ప్రసిద్ధి చెందిన ఈ ఫ్రైడే డ్రెస్ మార్కెట్‌కు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది.

సాక్షి, భీమవరం/పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు, పరిసరాల్లోని భగ్గేశ్వరం, దగ్గులూరు, లంకలకోడేరు, దిగమర్రు, పెనుమర్రు, బల్లిపాడు, ఆచంట వేమవరం గ్రామాల్లో పూర్వం నేత కార్మికులు ఎక్కువగా ఉండేవారు. బ్రిటీష్ హయాంలో వీరు తయారుచేసిన నేత చీరలు, తలపాగాలు తదితర వాటిని క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న దేవునిహాలులో విక్రయించుకునే వారు. అప్పట్లోనే మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి వీటిని కొనుగోలు చేసుకుని తీసుకువెళ్లేవారు. కాలక్రమంలో వస్త్ర రంగంలో మిల్లుల రాకతో చేనేత కార్మికులకు పని తగ్గిపోయింది. సరుకును మార్కెట్‌కు తెచ్చి విక్రయించే నేత కార్మికుల సంఖ్య తగ్గినప్పటికీ అప్పటికే మార్కెట్‌కు మంచి గుర్తింపు రావడంతో మిల్లు వస్త్రాలు తెచ్చి విక్రయించే వ్యాపారులు పెరిగారు. 2015 గోదావరి పుష్కరాల వరకూ ఆలయం దక్షిణ భాగంలో ఉన్న దేవునిహాలులో మార్కెట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం ఓ నాలుగేళ్లు స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో కొనసాగించారు. ప్రస్తుతం పాలకొల్లు–నర్సాపురం కెనాల్ రోడ్డులో వ్యాపారులు దేవునిహాలు పేరున శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి హోల్‌సేల్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ పేరిట ప్రత్యేకంగా హాల్‌ను నిర్మించుకున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాల్లా కాకుండా సంతను తలపించేలా బ్లాగు (ఖానా)లుగా ఏర్పాటుచేసుకున్నారు. ఈ హాల్‌లో మొత్తం 112 బ్లాగులు ఉన్నాయి. ప్రతి శుక్రవారం స్థానికులతో పాటు వస్త్ర వ్యాపారానికి ప్రసిద్ధిచెందిన రాజమహేంద్రవరం, ద్వారపూడి, మాచవరం ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి వ్యాపారాలు సాగిస్తుంటారు. ఈ మార్కెట్‌పై ద్వారా ఎన్నో కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.



దుకాణాలు, కొనుగోలుదారులతో కిక్కిరిసిన మార్కెట్ హాలు



పాలకొల్లులోని ఫ్రైడే సంత మార్కెట్ ప్రాంగణం



మార్కెట్‌లో ఓ దుకాణం

అన్ని వెరైటీలు లభ్యం

ఇక్కడ దొరకని దుస్తులంటూ ఉండవు. చిన్నారుల నుంచి పెద్దల వరకు, లో కాస్ట్ నుంచి హై కాస్ట్ వరకు ఉంటాయి. ప్రసిద్ధి చెందిన కంచి, బెనారస్, ధర్మవరం, ఉప్పాడ పట్టుచీరలు, కాటన్, సిల్క్స్, పార్టీ వేర్ చీరలు, క్లాత్, రెడీమేడ్ దుస్తులు, డ్రెస్ మెటీరియల్స్, బ్లౌజ్‌లు, పంచెలు తదితర వాటిని వ్యాపారులు హోల్‌సేల్‌గా, రిటైల్‌గా అమ్మకాలు చేస్తుంటారు. గురువారం రాత్రి ఆయా ప్రాంతాల నుంచి వ్యాపారులు సరుకుతో మార్కెట్‌కు చేరుకుని శుక్రవారం తెల్లవారుజాము నాలుగు గంటలకే షాపులను సిద్ధం చేసుకుంటారు. ఇక్కడ హోల్‌సేల్‌గా దుస్తులు కొనుగోలు చేసి బయట విక్రయించుకునే చిరు వ్యాపారులు చాలావరకు తెల్లవారుజాము సమయంలో కొనుగోలు చేసుకుని వెళ్లిపోతుంటారు. ఉదయం నుంచి అధిక శాతం రిటైల్ వ్యాపారం జరుగుతుంది. పాలకొల్లు, పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలుదారులు వస్తుంటారు. సాయంత్రం సమయానికి మార్కెట్ మూతపడిపోతుంది. బయటి మార్కెట్‌తో పోలిస్తే ధరలు కొంచెం తక్కువగానే ఉంటున్నాయని కొనుగోలుదారులు తెలిపారు.

ఆన్‌లైన్ షాపింగ్ ప్రభావం తక్కువే

మాల్స్, ఆన్‌లైన్ షాపింగ్ వచ్చాక వస్త్ర వ్యాపారం తీవ్రంగా దెబ్బతింది. దుకాణాల్లో అమ్మకాలు పడిపోయాయి. ఈ ప్రభావం సంత మార్కెట్‌పైనా పడినప్పటికీ వారానికి ఒక్కరోజే కావడంతో ఈ మార్కెట్‌కు ఆదరణ తగ్గలేదు. పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లో మార్కెట్ కిక్కిరిసి ఉంటుంది. జనం రద్దీని బట్టి ఆ సమయంలో రాత్రి వరకు అమ్మకాలు చేస్తుంటారు. ఒక్కో షాపులో రూ.30 వేలు నుంచి రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతుందని అంచనా.

ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది



పాలకొల్లు ఫ్రైడే సంత మార్కెట్‌కు ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడ దొరకని దుస్తులంటూ ఉండవు. అన్ని వర్గాల వారి కోసం అన్ని రకాల దుస్తులు అందుబాటులో, తక్కువ ధరల్లో దొరుకుతాయి.
– సుదర్శన్, వస్త్ర వ్యాపారి, రాజమహేంద్రవరం

38 ఏళ్లుగా ఇక్కడికి వస్తున్నా



ద్వారపూడి నుంచి సరుకు తీసుకుని 38 ఏళ్లుగా పాలకొల్లు ఫ్రైడే మార్కెట్‌కు వస్తున్నాను. నా చిన్నతనంలో నా తండ్రితో కలిసి వచ్చేవాణ్ణి. చుట్టుపక్కల ప్రాంతాలకు ఈ మార్కెట్ ఎంతో ప్రసిద్ధి.
– తిప్పాని అప్పారావు, చేనేత వస్త్ర వ్యాపారి, ద్వారపూడి

ఉపాధి దొరుకుతోంది



ప్రతి రోజూ పట్టణ మార్కెట్లో వ్యాపారం చేసుకుంటా. శుక్రవారం మాత్రం దేవునిహాలు మార్కెట్‌కు వెళ్లి ఏదోక షాపు పనిచేస్తా. ఒక్కరోజుకు రూ.600 నుంచి 800 వరకు ఇస్తుంటారు. ఇలా చాలామంది ఉపాధి పొందుతున్నాం.
– కె.పద్మారావు, గుమస్తా, పాలకొల్లు

బయట కన్నా ధరలు తక్కువే



డైలీ మార్కెట్ కన్నా దేవుని హాలులో దుస్తుల ధరలు తక్కువే. ముఖ్యంగా జాకెట్ ముక్కలు హోల్‌సేల్‌గా ఇక్కడే కొనుగోలు చేస్తుంటారు. ధరలు తక్కువగా ఉండడంతో వివాహాలు, పండుగల సమయంలో ఇక్కడ చాలా రద్దీగా ఉంటుంది.
– డి.లక్ష్మి, వినియోగదారిణి

గడపగడపకు సంక్షేమం



అత్తిలి: తిరుపతిపురంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ఉత్సాహంగా విలువిద్య పోటీలు



చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విలువిద్య పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

చింతలపూడి : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల విద్యార్థులకు చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విలువిద్య పోటీలు నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ మహమ్మద్ అంజాద్ అలీ ఆధ్వర్యంలో ఈ క్రీడాపోటీలు జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చదువుతోపాటు, పలు రకాల ఆటలు ఆడటం వలన శరీర దారుఢ్యం పెరగడంతో పాటు మేధస్సు కూడా పెరుగుతుందని, ఆత్మవిశ్వాసం కలుగుతుందని విద్యార్థులకు హితబోధ చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌జీకే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఇది ప్రాచీన కాలపు ఆట అని, ఆధునిక కాలంలో ఈ ఆటను ఇంకా కొనసాగించడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కనక దుర్గ ట్రేడర్స్ డైరెక్టర్ టి.వాణి మాట్లాడుతూ ఇటువంటి పోటీల నిర్వహణతో విద్యార్థుల ఒక లక్ష్యం ఏర్పడి, క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు. సీపీఈసీ అధ్యక్షులు గోలిచంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు చిల్లపల్లి మోహన్‌రావు, సెక్రటరీ విస్సంపల్లి సుందర్ రావు, లయన్స్ క్లబ్ నాయుడు అబ్బాయి మాట్లాడారు.

విజేతలు వీరే..

ఇండియన్ రౌండ్ టీమ్ చాంపియన్‌షిప్ బాలురు విభాగంలో జీడీసీ చింతలపూడి మొదటి స్థానంలో, జీడీసీ రాజోలు రెండో స్థానంలో, వీవీగిరి జీడీసీ దుంపగడప మూడో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో టీమ్ చాంపియన్‌షిప్ ఇండియన్ రౌండ్‌లో జీడీసీ చింతలపూడి మొదటి స్థానం, జీడీసీ రాజోలు రెండో స్థానం, వీవీగిరి జీడీసీ దుంపగడప 3వ స్థానం సాధించాయి.

వ్యక్తిగత బాలురు విభాగం ఇండియన్ రౌండ్ విభాగంలో ఎన్.లక్ష్మీనారాయణ, జీడీసీ చింతలపూడి మొదటి స్థానం, పి.కృష్ణ, సీబీఆర్ పిఠాపురం జీడీసీ ద్వితీయ స్థానం, ఎల్.శివకృష్ణ, జీడీసీ చింతలపూడి మూడో స్థానంలో నిలిచాయి.

బాలికల వ్యక్తిగత ఇండియన్ రౌండ్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను జీడీసీ చింతలపూడి దక్కించుకున్నాయి. కాంపౌండ్ బాలికల విభాగం ఎస్.జయ శృతి సంహిత డిగ్రీ కాలేజ్ మొదటి స్థానం, ఎస్.దీపిక ఏఎస్‌డీ ఉమెన్ జీడీసీ కాకినాడ రెండో స్థానం, ఆర్.రేవతి ఏఎస్‌డీ జీడీసీ కాకినాడ ఉమెన్ తృతీయ స్థానం సాధించగా, రికర్వ్ బాలికల విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఏఎస్‌డీ ఉమెన్స్ కాకినాడ కాలేజీ విజయం సాధించింది.

గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం



గణపవరం స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీప్రశాంతి

గణపవరం : గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపామని, ఎవరైనా గంజాయి రవాణాతో పట్టుబడితే శిక్షలు కఠినంగా ఉంటాయని ఏలూరు రేంజ్ డీఐజీ జి.అశోక్‌కుమార్ హెచ్చరించారు. శనివారం రాత్రి ఆయన గణపవరం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో గంజాయి అక్రమ రవాణకు సంబంధించి రెండేళ్ల క్రితం రెండు లక్షల కేసులు నమోదు అయ్యాయని, అనంతరం రెండేళ్ల కాలంలో 90 వేల కేసులు నమోదయ్యాయన్నారు. ఎక్కడైనా గంజాయి విక్రయించినా, రవాణా చేసినా 14500 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. గంజాయి కేసుల సంఖ్యను మరింత తగ్గించడానికి కృషి చేస్తున్నామన్నారు. సంక్రాంతి పేరుతో కోడిపందేలు, జూదాలు ఆడేవారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గణపవరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, గ్రామాలలో జూదాలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గణపవరం పోలీస్‌స్టేషన్ పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఏలూరు జిల్లాకు వచ్చిందన్నారు. గణపవరం స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారించి అవసరమైన సిబ్బందిని నియమిస్తామన్నారు. గణపవరం సర్కిల్ పనితీరును ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎస్పీ మేరీప్రశాంతి, గణపవరం సీఐ సుభాష్, ఎస్సై వేముల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం తక్షణ కొనుగోలుకు చర్యలు



అధికారులు, మిల్లర్లతో సమీక్షిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం: జిల్లాలో కోసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో శనివారం తన చాంబర్‌లో ధాన్యం కొనుగోలుపై జిల్లా సివిల్ సప్లై, రైస్ మిల్లర్స్ ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తీవ్ర తుపాను కారణంగా ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే కోసి ఉన్న పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా అమల్లో ఉన్న నిబంధనల మేరకు తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు వరి కోతలు మూడు, నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలని సూచించామన్నారు. రైతులు ఆరుబయట ధాన్యాన్ని ఆరబోసుకోకుండా చూడాలని, కోసిన ధాన్యాన్ని ఆర్‌బీకేలకు తరలించి కొనుగోలు చేసేలా చూడాలని జేసీ ఆదేశించారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, సివిల్ సప్లై జిల్లా మేనేజరు టి.శివరామప్రసాద్, డీఎస్ఓ ఎన్.సరోజ, ఏఎస్ఓ ఎం.రవిశంకర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీరామరాజు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖైదీలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



ఖైదీలకు అందించే ఆహారాన్ని పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ఖైదీలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆదేశించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తం కుమార్ ఆదేశాల మేరకు శనివారం ఆయన జిల్లా కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయసేవలపై, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థపై ఖైదీలకు అందించే ఉచిత సేవలపై అవగాహన కల్పించారు. ఈ నెల 9న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ యోగ్యమైన కేసులను రాజీ చేసుకోవాల్సిందిగా కోరారు. లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మునేశ్వరరావు, జిల్లా కారాగారం సూపరింటెండెంట్ ఆర్‌వీ స్వామి, జైలర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు శ్రీభృగు, మరీచి, అత్రి, కశ్యప శిష్య సహిత విఖనస మహాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు శనివారం తెలిపారు. ఆలయ తూర్పు ప్రాంతంలోని నూతన ఆలయంలో ఈ ప్రతిష్ఠా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అందులో భాగంగా తొలిరోజు 3న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణతో ప్రతిష్ఠా కార్యక్రమాలకు అర్చకులు శ్రీకారం చుడతారన్నారు. 4న ఉదయం హోమ క్రతువులు, 5న హోమం, జలాదివాస కార్యక్రమాలు, 6న ఉదయం జరిగే విశేష కార్యక్రమాలతో ప్రతిష్ఠా మహోత్సవాలు ముగుస్తాయని ఈఓ వివరించారు.

క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలిసిన అపుస్మా సభ్యులు



డిప్యూటీ సీఎంను సత్కరిస్తున్న అపుస్మా సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అపుస్మా తాడేపల్లిగూడెం జోన్ నూతన కార్యవర్గం ఎన్నిక కాబడిన సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని సత్కరించారు. అధ్యక్షుడు వాకలపూడి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పచ్చిపాల శివశంకర్, కోశాధికారి గుణ్ణం చిరంజీవి, అత్తంటి సుబ్బరాజు, గురువు హరిబాబు, సుంకర శ్రీనివాస్, విజయారెడ్డి, రామన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ప్రారంభమైన శిక్షణ

తణుకు: పట్టణంలోని ఎస్ఎస్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలో ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో చదువుతున్న మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వృత్తి విద్యా శిక్షణ (వోజేటీ) ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో నెలరోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. ఈ మేరకు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.కె.స్వరూప, జి.సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

రేలంగిలో ఉచిత కంటి వైద్య శిబిరం

ఇరగవరం: మండలంలోని రేలంగి గ్రామంలో శనివారం పాలకొల్లు ఆర్ఆర్ లయన్స్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో రేలంగి సహకార సంఘం వద్ద ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రేలంగి ఉప సర్పంచ్ ఎల్ ఎన్ పులుపు అక్కమాంబ ఆధ్వర్యంలో జరిగింది. ఈ శిబిరం దాత పిఎజెఎఫ్ కాకరాల వేణుబాబు ఆర్థిక సహాయంతో నిర్వహించినట్లు తెలిపారు. 111 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఇందులో 36 మందికి ఆపరేషన్లు, 9 మందికి మెరుగైన చికిత్స కోసం పాలకొల్లు కంటి ఆసుపత్రికి సిఫారసు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గట్టిం మాణిక్యాలరావు, రామావు, నరసింహమూర్తి, కామేశ్వరరావు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' ను విజయవంతం చేయాలి

తణుకు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు చెప్పారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, ఇతర అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో క్రీడాకారుల నమోదు, ప్రేక్షకుల నమోదును పెంచాలని తెలిపారు. అలాగే తణుకు మండలంలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. దీనికి సంబంధించిన అధికారులు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్ కుమార్, ఈవోపీఆర్‌డీ అంబటి కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కోతలు వాయిదా వేసుకోండి

అత్తిలి: వాతావరణ శాఖ నేటి నుంచి మూడు రోజుల పాటు వర్ష సూచన ప్రకటించిన నేపథ్యంలో రైతులు త్వరగా ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి కె మురళీకృష్ణ చెప్పారు. శనివారం అత్తిలి మండలం పాలూరు, కంచుమర్రు, స్కిన్నెరపురం గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. తుపాను కారణంగా మూడు రోజుల పాటు కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. పంట నూర్పిడి చేసిన రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించి గోనె సంచులు తీసుకుని ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రం ద్వారా రైస్‌మిల్లులకు తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, మండల వ్యవసాయశాఖాధికారి టీకే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవల ద్వారానే ఉత్తమ సమాజం

పెంటపాడు: మానవత సేవల ద్వారానే ఉత్తమ సమాజం ఏర్పడుతుందని, దానిని ప్రతిఒక్కరూ స్వాగతించాలని, సేవలను తప్పక వినియోగించుకోవాలని రాష్ట్ర మానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం పెంటపాడు డంపింగ్ యార్డు వద్ద ఉమ్మడి జిల్లా మానవత చైర్మన్, విశ్రాంత ఆంధ్రాబ్యాంక్ సీనియర్ మేనేజర్ తాడేపల్లి మోహనరావు, గ్రామ మాజీ సర్పంచ్ తాడేపల్లి సూర్యచంద్రకుమారి దంపతుల సహకారంతో పెంటపాడుకు ప్రత్యేక మార్చురీ ఫ్రీజర్‌ను బహుకరించారు. ఈ ఫ్రీజర్‌ను రామచంద్రారెడ్డి శనివారం ప్రారంభించారు. రామిశెట్టి గంగాధరరావు, రామాంజనేయరెడ్డి, వినాయక్, యువరాజు, బంగార్రాజు, తారాడి పాల్, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- తణుకు, తాడేపల్లిగూడెం డివిజన్లలో సందడిగా వై ఏపీ నీడ్స్ జగన్



అత్తిలి: తిరుపతిపురంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు వచ్చాయని యువనేత కారుమూరి సునీల్‌కుమార్ తెలిపారు. తణుకు మున్సిపాల్టీ పరిధిలోని 17వ వార్డు సబ్ స్టేషన్ ప్రాంతంలోని సచివాలయ వద్ద శనివారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదవర్గాలకు అందుతున్న సంక్షేమ ఫలాలు వారి జీవనశైలిని మారుస్తుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా చిన్నారుల చదువుల్లో విప్లవాత్మకమైన మార్పులు జగనన్న తీసుకువచ్చారని అందులో భాగంగా అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్ద వంటి పథకాలు పేదవర్గాల పిల్లలు కూడా ఉన్నత చదువులు చదువుకునే వెసులుబాటు కలిగిందని అన్నారు. ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అమెరికాలోని సమిట్‌లలో సైతం పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రపంచానికి తెలియచేస్తుండడం జగనన్న గొప్పతనమన్నారు. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరణతో పాటు సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పట్టికను సునీల్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం స్థానికంగా ఉన్న ప్రజల ఇంటి గుమ్మంలోకి వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్‌లు అందచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వార్డు నాయకులు కట్టా కిషోర్, రాచమళ్ల సత్యనారాయణ, అడ్డాల రామకృష్ణ, అంబుల సత్యనారాయణ, కామన శ్రీను, చిక్కాల రామారావు, గుబ్బల సూర్యచంద్రరావు, రేలంగి రాంబాబు, పుల్లెపు సూర్యచంద్రరావు, జిలానీ తదితరులు పాల్గొన్నారు.



తణుకు అర్బన్: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కారుమూరి సునీల్‌కుమార్



ఇరగవరం: రేలంగి-2లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసాం

అత్తిలి: ఎన్నికల సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడంతో నేడు ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్లగలుగుతున్నామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం సాయంత్రం అత్తిలి మండలం తిరుపతిపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలో అమలు చేయనటువంటి సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేసి, ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికలలో తిరిగి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యాదీవెన, విద్యాకానుక, అమ్మ ఒడి, మనబడి నాడు-నేడు వంటి పథకాలను ప్రవేశపెట్టి అందరిమన్ననలు పొందారని తెలిపారు. టీడీపీ, జనసేన పార్టీలు కల్లబొల్లి మాటలు చెబుతూ మీ ఇళ్లకు వస్తున్నారని, మీ కుటుంబ వివరాల డేటాను చోరీ చేసేందుకు చూస్తున్నారని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అమలు కాని హామీలిచ్చిన చంద్రబాబు ఆతరువాత మ్యానిఫెస్టోని సైతం వెబ్‌సైట్ నుంచి తొలగించాడని విమర్శించారు. ముందుగా పార్టీ పతాకాన్ని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఎగురవేసారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, సర్పంచ్ కాండూరి లీలామణికంఠ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు పెన్మెత్స రామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు వద్ది రామచంద్రరావు, గవర నాగన్న, తోలేటి కొండ, శలారామలింగ విష్ణుమూర్తి, అరిటాకుల నాగశ్రీనివాస్, ఎంపీడీవో అమీలుజమా, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి

ఇరగవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం అన్నారు. మండలంలోని రేలంగి-2 సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలో సంక్షేమ పథకాల బోర్డులను, వైఎస్సార్ సీపీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంత అవసరమో వివరిస్తూ ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు గ్రామాల్లోని కుటుంబలు వద్దకు వెళ్లి చేకూరిన లబ్ధిని, పథకాల వివరాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, రేలంగి సర్పంచ్‌లు చేబ్రోలు స్వరాజ్యం, ఉప సర్పంచ్ పులుపు అక్కమాంబ, ఎంపీటీసీలు మహాలక్ష్మి, మెంటరాజు, కిరణ్మయి, రేలంగి సొసైటీ అధ్యక్షుడు నడుంపల్లి రాంబాబు రాజు, ఎంపీడీవో ఎ శ్రీనివాస్ , ఈవోపిఆర్డీ నరసంహమూర్తి, గ్రామా పార్టీ అధ్యక్షుడు పులుపు అనిల్, నాయకులు చేబ్రోలు పెద్దిరాజు, మైనం పాము, వడ్డే మార్కండేయులు, పులుపు సునీల్, కాసాని సత్యనారాయణ, కార్యదర్శి బి లక్ష్మి నారాయణ, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రజక సంఘ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రజక వృత్తిదారులను ఆదుకోవాలని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడక రాజు కోరారు. స్థానిక అపరాల మార్కెట్ వర్కర్స్ యూనియన్ భవనంలో శనివారం ఏపీ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో పసుపులేటి శ్రీనివాస్ అధ్యక్షతన రజకుల సమస్యలు, పరిష్కార మార్గాలు, పట్టణంలో జరుగుతున్న చైతన్య తరగతులు విజయవంతం కోసం ప్రత్యేక సమావేశం జరిగింది. మడకరాజు మాట్లాడుతూ రజక వృత్తిదారుల పట్ల నేటికి కుల వివక్షత కొనసాగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలో సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు రోజుల పాటు రజకుల అవగాహన చైతన్య తరగతుల్లో భాగంగా ఆదివారం తాడేపల్లిగూడెంలో రజక వృత్తిదారుల ఆధ్వర్యంలో ప్రదర్శన అనంతరం ఎస్‌ఓ గ్రౌండ్లో రజక గర్జన సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వద్దిపర్తి శ్రీనివాస్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీనుల విందుగా శ్రీకృష్ణరాయభారం హరికథ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ద్వితీయ హరికథా సప్తాహంలో భాగంగా పట్టణంలోని మహాలక్ష్మినగర్ రోడ్డు నెంబర్4లో పురపాలక సంఘం మాజీ సభ్యులు కర్రి ప్రభాకర్ బాలాజీ నివాసం వద్ద శనివారం రాత్రి శ్రీకృష్ణ రాయబారం హరికథ వైభవంగా నిర్వహించారు. ఒంగోలు వాస్తవ్యులు వేదవతి భాగవతారిణిచే వీనుల విందుగా కథను ఆలపించారు. మృదంగంపై సరస్వతుల హనుమంతరావు, వయోలిన్‌పై వీరా శివ ప్రసాద్‌లు సహకరించారు. తొలుత కోలాట భజన నిర్వహించారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమం చేరువ

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- తిరుపతిపురంలో గడపగడపకు మన ప్రభుత్వం



తిరుపతిపురంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి కారుమూరి

అత్తిలి: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి మండలం తిరుపతిపురం, బల్లిపాడు గ్రామాల్లో శనివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు సంబంధించి వేల కోట్ల రూపాయలు బటన్‌నొక్కి మీఖాతాకే జమ చేస్తున్నారని, ఇటువంటి సంక్షేమ పాలన కొనసాగాలంటే తిరిగి మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి, ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ సొమ్మును దోచుకుతిన్నారని విమర్శించారు. గత పాలనలో పేదలకు ఒక్క సెంటు భూమి కూడా ఇచ్చిన దాఖలాలు లేవని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్షలాది మంది అక్కచెల్లెమ్మలకు ఇంటి స్థలాలు సమకూర్చి, ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ఇటీవల జగనన్న ఆరోగ్యసురక్ష వంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు జరిపి, మందులను అందజేశారన్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పౌరసేవలు అందిస్తున్న ఈ ప్రభుత్వానికి మీ ఆశీస్సులు అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, సర్పంచ్‌ల ఛాంబర్ మండల అధ్యక్షుడు శింగంశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, మాజీ సర్పంచ్ ఆకుల పండుస్వామి, ఉపసర్పంచ్ తలారి శ్రీనివాస్, ట్రస్టుబోర్డు చైర్మన్ తోట వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు గుబ్బల ఆంజనేయులు, మాజీ చైర్మన్‌లు ఆకుల బులినాగేశ్వరరావు, ధనుమూరి తాతాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డి రామచంద్రరావు, గవర నాగన్న, తోలేటి కొండ, శలా రామలింగవిష్ణుమూర్తి, అరిటాకుల నాగశ్రీనివాస్, కంకిపాటి రత్నరాజు, ఎంపీడీవో అమీలుజమా, ఈవోఆర్డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ ఆనందం వేడుకలు



తణుకులో యూసీఏ సావనీర్ ఆవిష్కరించిన మంత్రి కారుమూరి, యూసీఏ ప్రతినిధులు

తణుకు అర్బన్: యేసుక్రీస్తు మాటలను విశ్వాసులంతా తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో శనివారం రాత్రి యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ (యూసీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ ఆనందం వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వాసులంతా ప్రభువు చూపించిన దారిని ఆచరణలో పాటించాలని సూచించారు. చిన్నస్థాయి నుంచి మంత్రి స్థాయికి ఎదిగానంటే ప్రభువు నన్ను దీవించారనే నమ్ముతున్నానని స్పష్టం చేశారు. ఒకే వేదికపై ఇంతమంది దైవజ్ఞులు కలిసి ప్రార్థన చేయడం సంతోషంగా ఉందని, మీ అందరి ప్రార్థనలతో తణుకు నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి కారుమూరి చేతులమీదుగా క్రిస్మస్ కేక్ కట్‌చేయడంతోపాటు యూసీఏ 30 సంవత్సరాల వేడుకల్లో భాగంగా సావనీరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూసీఏ అధ్యక్షుడు బ్రదర్ మనోజ్‌బాబు, మేడిది జాన్సన్, బిషప్ ఎం.ప్రేమ్‌కుమార్, డాక్టర్ ఆనంద్, బ్లెస్సింగ్ రాజ్, డేవిడ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోండి



తాడేపల్లిగూడెంలో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ ప్రత్యేకాధికారి చెన్నయ్య

తాడేపల్లిగూడెం రూరల్: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ ప్రత్యేకాధికారి కే.చెన్నయ్య తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని ఓటు నమోదు ప్రత్యేక కేంద్రాలను శనివారం మున్సిపల్ ప్రత్యేకాధికారి కే.చెన్నయ్య, నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ.దుర్గేష్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. తొలగింపులు, మార్పులు, బదలాయింపులకు సంబంధించి సదరు ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎస్.శివశంకర్, సర్వేయర్ రౌతు రామకృష్ణలు ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, బీఎల్వోలు సీహెచ్.భాస్కరరావు, సీహెచ్.ప్రశాంతి, బి.రాంబాబు, కేవి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన చెస్ క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో విజేతల వివరాలను శనివారం అకాడమీ చైర్మన్ సీహెచ్ఏఆర్‌కే వర్మ ప్రకటించారు. అండర్ 6 విభాగంలో మొదటి స్థానం శశాంక్, ద్వితీయ స్థానం టి.గోపిక, అండర్ 8 విభాగంలో మొదటి స్థానం పి.జోగేంద్ర, ద్వితీయ స్థానం ఎస్.రిత్విక్ రెడ్డి, అండర్ 10 విభాగంలో మొదటి స్థానం ఎస్.గోకుల్, ద్వితీయ స్థానం ఎ.ధనుష్, అండర్ 12 విభాగంలో మొదటి స్థానం ఎస్‌కే.సమీరా, ద్వితీయ స్థానం జి.అవినాష్, అండర్ 14 విభాగంలో మొదటి స్థానం ఎ.భార్గవ్, ద్వితీయ స్థానం అనీష్, అండర్ 16 విభాగంలో మొదటి స్థానం రాజ నాగసాయి, ద్వితీయ స్థానం రాకడ కీర్తిలు ఎంపికయ్యారు. పోటీలలో విజయం సాధించిన వారికి మెడల్స్ సర్టిఫికెట్స్ అందజేశారు. అకాడమీ కార్యదర్శి, కోచ్ ఎస్.ఎస్.చంద్రశేఖర్ తదితరులు పర్యవేక్షించారు. అన్ని విభాగాల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ 6 కు 6 పాయింట్లుసాధించిన పి.జోగేంద్ర (భారతీయ విద్యాభవన్స్)ను అభినందించారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

తాడేపల్లిగూడెం రూరల్: మిచాంగ్ తుపాను దృష్ట్యా ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ ఎస్.శివశంకర్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని కృష్ణాయపాలెం, నందమూరు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివశంకర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆఫ్ లైన్ విధానంలోనూ ధాన్యాన్ని మిల్లులకు పంపించాలన్నారు. ఇంకా కోతలు పూర్తి కాని రైతులు మూడ్రోజుల పాటు ఆగాలని హితవు పలికారు. ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టిన రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు పడుతున్న సందర్భంలో దాళ్వా నారుమడులు వేయొద్దన్నారు. ఏమైనా సమస్యలుంటే సమీపంలోని తహసీల్దార్, ఏవో, ఎంపీడీవోలకు తెలియజేయాలన్నారు. వారి వెంట రైతులు గజ్జరపు రామకృష్ణ, పుట్టా ఉమామహేశ్వరరావు, శివయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, శివ, పలువురు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్.అగ్రహారం సబ్ స్టేషన్ సమీపం ఆర్-11, 12 లే అవుట్‌లోని జగనన్న కాలనీలో ఆప్షన్-3లో చేపట్టిన ఇంటి నిర్మాణాలను శనివారం గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆనంద్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న ఇళ్లను డిసెంబరు 1 నుంచి జనవరి 31వ లోపు పూర్తి చేయాలన్నారు. దీనికనుగుణంగా లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. తొలుత అప్పారావుపేట గ్రామంలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర సభలో పాల్గొని ప్రసంగించారు. ఆయన వెంట హౌసింగ్ డీఈ కేవీవీఎస్.ప్రసాద్, ఏఈ వైవి.వెంకట్రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు కే.నాగేశ్వరరావు, ధర్మ తదితరులు ఉన్నారు.

షణ్ముఖి ఆంజనేయరాజు జయంతి వేడుకలు



తణుకులో కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తణుకు: పట్టణానికి చెందిన షణ్ముఖి ఆంజనేయరాజు కళాపీఠం ఆధ్వర్యంలో షణ్ముఖి ఆంజనేయరాజు 95వ జయంతి మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక సురాజ్య భవన్‌లో కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు రసరాజు, విజయ షణ్ముఖి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. నంది అవార్డు గ్రహీత వాడ్రేవు సుందరరావు ఏకపాత్రాభినయం చేసిన యయాతి పుత్ర రూపకం ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పౌరాణికరంగస్థల నటీమణి గంటా మంగాదేవికి షణ్ముఖి పురస్కారాన్ని అందజేశారు. ఏపీ నాటక పరిషత్ అధ్యక్షుడు బుద్దాల రామారావు, శశి విద్యాసంస్థల అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, గరుడ అవార్డు గ్రహీత దంపూరి దుర్గాప్రసాద్, వావిలాల సరళాదేవి, డాక్టర్ వి.వెంకట్రాజు, సూరంపూడి కామేష్, లోలభట్టు శ్రీనివాసరాజు, దేవళ్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావంతో రైతులకు వెలుసుబాటు



రైతులతో మాట్లాడుతున్న చెన్నయ్య, తదితరులు

పెంటపాడు: తుపాను ప్రభావంతో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించిందని దానిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో చెన్నయ్య, మండల తహసీల్దార్ జీవీ శేషగిరిరావులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వ్యవసాయశాఖ, రెవిన్యూశాఖ ఆధ్వర్యంలో తుపాను ప్రభావం దృష్ట్యా పలు గ్రామాలను సందర్శించారు. బంగాళాఖాతంలో తుపాను ప్రభావం వల్ల రైతులు బెంగపడవద్దన్నారు. ఈ విషయంపై రాష్ట్రప్రభుత్వం రైతుల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకొందన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో రైతులకు పలు సూచనలు చేసారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ఏడీఏ పి. మురళీకృష్ణ, మండల వ్యవసాయాధికారి కె. పార్థసారథి, ఆయా గ్రామాల వీఏఏలు, ఆర్ఐ కనక దుర్గ తదితరులు పాల్గొన్నారు.

90 మందికి వైద్య పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం వారి ఆధ్వర్యంలో శనివారం అధ్యక్షులు వంగపండు రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో గరికిపాటి బాపయ్య శర్మ ఆర్థిక సహకారంతో కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆసుపత్రిలో శనివారం ఉచిత షుగర్ రక్త పరీక్ష శిబిరం జరిగింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ పి.శ్రీకాంత్ శిబిరాన్ని ప్రారంభించారు. 90 మందికి వైద్య పరీక్షలు జరిగాయి. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి జి.హరిబాబు, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పచ్చా వెంకటేశ్వరరావు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.